క్లుప్తంగా

నమోశివ రుద్రాయ


ఉమాచంద్ర మౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పలురకాల పుష్పాలతో స్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

పూర్వ విద్యార్థికి అభినందన


పూర్వ విద్యార్థి శ్రీమాన్‌ప్రీత్‌ను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ సూర్యనారాయణరెడ్డి

పరవాడ: సింగపూర్‌లోని నాన్‌యంగ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షల్లో మూడో ర్యాంక్ సాధించిన పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల పూర్వ విద్యార్థి శ్రీమాన్‌ప్రీత్‌ను ఆ పాఠశాల డైరెక్టర్ పి.సూర్యనారాయణ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో సోమవారం జరిగిన అభినందన కార్యక్రమంలో శ్రీమాన్‌ప్రీత్‌ను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీమాన్‌ప్రీత్ దేశం గర్వించదగ్గ విద్యార్థిగా ఎదుగుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు పాల్గొన్నారు.

6న భువనేశ్వరీదేవి అధివాసం


భువనేశ్వరీదేవి అమ్మవారు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు పెదయాతపాలెం చెల్లయ్యమ్మతోటలో కొలువైన భువనేశ్వరీదేవి అధివాసం ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్టు శ్రీభువనేశ్వరీ సంస్థాన్ ట్రస్ట్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలం రోజులకు ఒకసారి నిర్వహించే ఈ అధివాసంలో ఒక్కో పత్రితో పూజలు నిర్వహిస్తారు. దీనిలో భాగంగా 6వ తేదీన బిళ్ల గన్నేరు పత్రితో అమ్మవారిని పూజించనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు.

నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ప్రసాద్

సింహాచలం: అక్షర భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చినముషిడివాడ, గొల్లనారాయణపురం, పాపయ్యరాజుపాలెం, గొల్లవిల్లిపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, జామెంటరీ బాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. మొత్తం 555 మంది విద్యార్థులకు పంపిణీ చేసినట్టు అక్షరభారతి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ జేసీబీ ప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది రెండు విడతలుగా ఇప్పటి వరకు 1200 మందికి పుస్తకాలు పంపిణీ చేసినట్టు చెప్పారు.

హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన సదస్సు


ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ

విశాఖ లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయసేవ సదన్‌లో హ్యూమన్ ట్రాఫికింగ్, దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ ప్రసంగించారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, మహిళా సాధికార అధికారి బి.వెంకటేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్య పద్మ, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మోహన్ లక్ష్మి, సభ్యులు డాక్టర్ బాబీ, జేసుదాసు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పెద్దరాజు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

పౌర హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


పౌర హక్కులపై ప్రసంగిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

సబ్బవరం: పౌర హక్కుల పరిరక్షణ మన అందరి బాధ్యత కావాలని తహసీల్దార్ బి. సత్యనారాయణ అన్నారు. మండలంలోని అసకపల్లి ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అంటరానితనం రూపుమాపడానికి, దళితుల హక్కుల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలని ఆయన సూచించారు. ఎంపీడీవో రమేష్ నాయుడు మాట్లాడుతూ ఎంతో అభివృద్ధి చెందుతున్న కాలంలో ప్రజల మధ్య తారతమ్యాలు చోటుచేసుకోవడం దురదృష్టకరం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి నర్సింగరావు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శనానికి వెళ్లి ..


రోడ్డు మీదే కుప్పకూలిన మూర్తి

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా సింహాచలం సమీపంలోని ప్రహ్లాదపురానికి చెందిన వృద్ధుడు అనారోగ్యంతో సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ప్రహ్లాదపురానికి చెందిన 67 ఏళ్ల వృద్ధుడు ఏఎస్ఎస్ మూర్తి అరసవల్లి సూర్యనారాయణ స్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణానికి శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరాడు. ఒక్కసారిగా వాంతులు కావడంతో రోడ్డు మీదనే కుప్పకూలిపోయాడు. ఈ విషయమై రెండో పట్టణ సీఐ శ్రీనివాసరావును వివరణ అడగ్గా ఇది సహజ మరణమని, మృతుని కుమార్తె, బంధువులు రావడంతో మృతదేహాన్ని అప్పగించామని తెలిపారు.

కోక్‌ఓవెన్స్‌లో పార్కు ప్రారంభం


పార్కును ప్రారంభిస్తున్న జీఎం సత్యనారాయణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ విభాగంలో సోమవారం ఫల్ (పండ్ల తోట) పార్కును ప్రారంభించారు. స్టీల్‌ప్లాంట్‌లో 38 ఏళ్ల విధులు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న కోక్‌ఓవెన్స్ విభాగం సీఆర్‌జీ సెక్షన్ జీఎం ఆర్.వి.సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇటువంటి పార్కులు పర్యావరణానికి మేలు చేస్తాయన్నారు. ఈ సందర్భంగా అధికారులు, కార్మిక నాయకులు ఆర్.వి. సత్యనారాయణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పి.కె. మిశ్రా, డీజీఎం కె. తాతారావు, దుర్గాప్రసాద్, వై.కె. దాస్, ఎం. నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమంలో మరో మైలురాయి

900వ రోజుకు రిలే దీక్షలు


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం: ఉక్కు కర్మాగార పరిరక్షణ కోసం, కార్మికుల భవిష్యత్తు కోసం 900 రోజులుగా చేస్తున్న దీక్షలు మరో మైలురాయిని చేరుకున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. దేశ చరిత్రలోనూ ఈ ఉద్యమం నిలిచిపోతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 900వ రోజు సోమవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇస్తే కార్మికుల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

17 నుంచి శ్రావణ మాస పూజలు


సిరులతల్లి కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: కనమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు శ్రావణమాస పూజలు జరగనున్నాయి. నెల రోజుల పాటు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో రెండు విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు(దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుంది. పూజ అనంతరం భక్తులకు శేష వస్త్రాలు, మహాప్రసాదం అందజేస్తారు. పూజా రుసుంను అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచిలో చెల్లించాలని ఆలయ ఈవో శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. పూర్తి వివరాలకు 0891-2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించాలన్నారు. పూజలో పాల్గొనలేని భక్తుల గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మి యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటికి పంపనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

డీఆర్ఎం ఆకస్మిక తనిఖీ



దువ్వాడ రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు, వసతులను వాల్తేరు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పరిశీలించారు. సోమవారం ఆయన దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో వసతులు, సౌకర్యాలు పరిశీలించారు. ప్రయాణికుల వెయిటింగ్ హాల్, కార్యాలయాలు, టికెట్ కౌంటర్, ఫుట్ ఓవర్ వంతెన, వాడకం నీటి ఔట్‌లెట్లను తనిఖీ చేశారు. వ్యాపారులు, ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు, వసతులపై ఆరా తీశారు. సిబ్బందితో ముచ్చటించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ పీకే మహరాణా, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సీహెచ్.రఘువీర్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్‌ల్లో విజిలెన్స్ తనిఖీలు

ఎంవీపీకాలనీ: జిల్లా విజిలెన్స్ అదనపు ఎస్పీ స్వరూపారాణి ఆధ్వర్యంలో సోమవారం మద్దిలపాలెం బీపీసీఎల్, అనకాపల్లి ఎస్సార్ పెట్రోల్ బంక్‌ల్లో తనిఖీలు నిర్వహించారు. పెట్రోల్, డీజిల్ శాంపిళ్లను విజిలెన్స్ అధికారులు సేకరించారు. ఆయా పెట్రోల్ బంకుల్లో కల్తీ జరుగుతున్నట్లు వస్తున్న ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు స్వరూపారాణి తెలిపారు. తనిఖీల్లో సీఐ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బాబర్‌సలీమ్‌పాషాకు సత్కారం


బాబర్‌సలీమ్‌పాషాను సత్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

పరవాడ: ఎన్టీపీసీ సెంట్రల్ ఎన్‌టీసీ లీడర్‌గా నియమితులై తొలిసారిగా సింహాద్రి ఎన్టీపీసీని సందర్శించిన బాబర్‌సలీమ్‌పాషాను ఎన్టీపీసీ సింహాద్రి మజ్దూర్ యూనియన్ నాయకులు దీపాంజలినగర్‌లో సంగమం హాల్లో ఘనంగా సత్కరించారు. సన్మాన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకులు వి.వి.శేషుబాబు, ఎస్ఎంయూఎస్ అధ్యక్షుడు ఎంజేపీ లెనిన్, ప్రధాన కార్యదర్శి బి.భీమరాజు, వెల్ఫేర్ కార్యదర్శి వై.రమేష్, ఎస్సీఎస్టీ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.లక్ష్మి, యూనియన్ ప్రతినిధులు వై.సురేష్, వి.సెంథిల్, అషిత్ రాయ్‌చౌదరి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. లేదా ఈ మెయిల్ endow-eokanaka@gov. in ద్వారా తెలుసుకోవచ్చు.

సత్యదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నేడు


మాసహిత సత్యనారాయణస్వామి

డాబాగార్డెన్స్: అధిక శ్రావణ శుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని ఇసుక కొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. భక్తులు సామూహిక వ్రతంలో పాల్గొనాలని, సత్యదేవుడిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. విశేష పౌర్ణమి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. భక్తులు ప్రదక్షిణ చేసేందుకు, విశేష వ్రతాచరణకు ఆలయ ప్రధాన అర్చకుడు పి.నరసింహాచార్యులు నేతృత్వంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

హిందీ హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు గడువు పెంపు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ (చెన్నై) సెప్టెంబరులో నిర్వహించే హయ్యర్ పరీక్షల ఫీజు చెల్లింపునకు ఈ నెల 5 వరకు గడువు పెంచారు. ఆంధ్ర, తెలంగాణలో వర్షాల కారణంగా రూ.10 అపరాధ రుసుముతో ఈ గడువు పెంచినట్టు నిర్వాహకులు ప్రకటించారు. మిగిలిన వివరాలకు 89858 97419లో సంప్రదించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్ కృష్ణారావు కోరారు.

బోటు షికారు నిలిపివేత

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో బోటు షికారును ప్రస్తుతం నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సముద్రంలో అలల ఉధృతి తీవ్ర స్థాయిలో ఉండటం, బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం దృష్ట్యా బోటు షికారు నిలిపివేస్తున్నామని, వాతావరణం అనుకూలించిన తరువాత కొనసాగిస్తామని పేర్కొన్నారు.

యువ టూరిజం క్లబ్ ప్రారంభం

ఆరిలోవ: ప్రభుత్వ ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఐ)లో యువ టూరిజం క్లబ్‌ను సోమవారం ప్రారంభించారు. దీనిలో ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థుల కో ఆర్డినేటర్లు ఇద్దరు(ఒక బాయ్, ఒక గర్ల్)తోపాటు అధ్యాపకులతో కలసి ఐదుగురు సభ్యులుగా ఉన్నారు. దీని కోసం బ్యానర్ తయారు చేసి ఇన్‌స్టిట్యూట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వి.రమణ మాట్లాడుతూ యువ టూరిజం క్లబ్ ద్వారా ప్రజలకు, నగరానికి వచ్చే టూరిస్టులకు కేంద్ర, రాష్ట్ర టూరిజంపై అవగాహన కల్పిస్తారన్నారు. దీనివల్ల టూరిజంలో యువతకు కలిగే ఉద్యోగ అవకాశాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో టూరిజం జిల్లా అధికారి దాస్, అధ్యాపకులు రవి, పార్థసారథి, సిబ్బంది దివ్య, మహాలక్ష్మి, కృష్ణ, లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారికి వెండి కుందుల బహూకరణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి సోమవారం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ రూ.7 లక్షలు విలువ చేసే వెండి కుందులను బహూకరించారు. మంగళవాయిద్యాల నడుమ వెండి కుందులను తీసుకొచ్చి అంతరాలయంలో శ్రీవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జగన్మోహనాచార్యులు, టీటీడీ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.


వెండి కుందులను తీసుకొస్తున్న మావూరి వెంకటరమణ

జెడ్సీ దృష్టికి బీఆర్‌టీఎస్ బాధితుల సమస్యలు


జెడ్సీ మల్లయ్యనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఎర్ర వరహానరసింహం

సింహాచలం: బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ బాధితులందరికీ పూర్తి న్యాయం చేయాలని 98వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం కోరారు. బీఆర్‌టీఎస్ విస్తరణకు సంబంధించి బాధితుల అభ్యంతరాలు తెలపాలని జీవీఎంసీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎర్ర వరహా నరసింహం సోమవారం జోన్-8 జెడ్సీని కలిసి తమ అభ్యంతరాలు తెలియజేశారు. టీడీఆర్‌ల వల్ల బాధితులకు స్థిర నివాసం ఏర్పడదని, 80 శాతం మంది నిర్వాసితులు 30 నుంచి 60 గజాల్లోనే ఇళ్లు నిర్మించుకుని ఉన్నారని, వారందరికీ అడవివరం గ్రామంలోనే వుడా లేఅవుట్ వేసి కనీసం 150 గజాల చొప్పున స్థలం ఇవ్వాలన్నారు. రెండు లైన్లు మాత్రమే విస్తరణ చేయాలని కోరారు. ఖాళీ స్థలం కోల్పోతున్న వారికి అనుభవ హక్కు లేదా రిజిస్టర్ దస్తావేజులు ప్రాతిపదిక తీసుకుని 1.4 నిష్పత్తిలో టీడీఆర్ ఇవ్వాలన్నారు. బాధితుల సమక్షంలో ఇళ్లు, ఇళ్లస్థలాల కొలతలు వేసి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

బీఆర్‌టీఎస్ బాధితులకు న్యాయం చేయాలి


నిరసనలో పాల్గొన్న గంగారావు తదితరులు

సింహాచలం: అడవివరం జంక్షన్ నుంచి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో భాగంగా ఆస్తులు నష్టపోతున్న వారికి న్యాయం చేయాలని సీపీఎం నాయకులు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. సీపీఎం ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మాట్లాడుతూ సాధారణ ప్రజలకు నివాసమే కష్టమవుతుందని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ అనంతరం మిగిలిన స్థలం 30 మీటర్లు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 మీటర్ల నుంచి 30 మీటర్లకు తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే మిగిలిన స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేసుకునేందుకు జీవీఎంసీ ప్లాన్ మంజూరు చేయాలన్నారు. డిమాండ్లు పరిష్కరించకుండా విస్తరణ చేపడితే పనులు అడ్డుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం గోపాలపట్నం జోన్ కార్యదర్శి బలివాడ వెంకట్రావు, నాయకులు టీవీ కృష్ణంరాజు, సీహెచ్. సత్యనారాయణ, ముద్దాడ ప్రసాద్, లంక అప్పలరాజు, ఆల్తి నాగమతి తదితరులు పాల్గొన్నారు.

253 మందికి కంటి వైద్య పరీక్షలు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సింహాచలం: పెందుర్తి మండలం ఎస్ఆర్‌పురంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి డాక్టర్ సువర్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 253 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 33 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. పెందుర్తి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, ఎంపీపీ మధుపాడ నాగమణి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాలచంద్ర, మహాలక్ష్మి నాయుడు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల ఆందోళన


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

మహారాణిపేట: అగ్రి గోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.మంగరాజు మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ లోగా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆగస్టు 30వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి అగ్రిగోల్డ్ బాధితులు విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మధుసూదనరావు, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు పాత్రుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.

పురందేశ్వరి వ్యాఖ్యలపై వామపక్షాల నిరసన


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై ఏది లాభం అయితే అది చేస్తామని ప్లాంట్ అమ్మకపు చర్యలను బలపరిచిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి వ్యాఖ్యలను వామపక్ష పార్టీలు ఖండించాయి. వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్, విభజన హామీలను బీజేపీ ప్రభుత్వం అమలు చేయకుంటే ప్రజా ఉద్యమం చేపడతామని నాయకులు హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, రైల్వేజోన్, విభజన హామీలు, ప్రభుత్వ భూముల రక్షణ, ఆదానీ గంగవరం పోర్టు కార్మికులకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని ఎండగడుతూ సీపీఎం, సీపీఐ, ఎం.సీపీఐయూ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డా.బి. గంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే చర్యలు వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎస్కే రెహ్మాన్, ఎ.విమల, కె.కుమారి, పి.చంద్రశేఖర్, యుఎస్ఎన్‌రాజు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తూ మూర్ఛతో వ్యక్తి మృతి


మృతి చెందిన ఎల్లంకి శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధికి గురై మృతి చెందిన ఘటన ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం జరిగింది. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ఎల్లంకి శ్రీనివాస్(44) ఓ లిఫ్ట్ కంపెనీలో మార్కెటింగ్ విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం శ్రీనివాస్ గాజువాక నుంచి ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్దకు వచ్చేసరికి మూర్ఛ రావడంతో హఠాత్తుగా తన వాహనాన్ని నిలిపి పక్కకు ఒరిగిపోయాడు. కొద్ది సేపటికే మృతి చెందాడు. పలువురు ఆయనకు సపర్యలు చేసినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం అందించారు. మృతునికి భార్య, పాప, బాబు ఉన్నారు.

వైఎంసీఏ సౌత్ ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా రొనాల్డ్


రొనాల్డ్ విలియమ్స్

బీచ్ రోడ్డు: వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్‌లో విశాఖ వైఎంసీఏకు చెందిన నలుగురికి చోటు లభించింది. వైఎంసీఏ సౌత్‌ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా మరోసారి రొనాల్డ్ విలియమ్స్ ఎంపికయ్యారు. సోమవారం జరిగిన వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో రొనాల్డ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేషనల్ కౌన్సిల్ వైస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ బెట్సీ విలియమ్స్, ఈసీ సభ్యులుగా డాక్టర్ కృపానందకుమార్, విజయ్ ప్రధాన్ ఎన్నికయ్యారు.